క్లుప్తంగా

15 నుంచి పీడీఎస్‌యూ మహాసభలు

కంబాలచెరువు: నెల్లూరులో డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.కిరణ్ కుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల వద్ద మంగళవారం మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కడియం: కడియపులంకలోని మహాలక్ష్మి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి నేత్రదర్శనం ఇచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా దాతల సహకారంతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

లక్ష్మీ హ్యుందాయ్‌లో స్మార్ట్‌కేర్ క్లినిక్ శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని లక్ష్మీ హ్యుందాయ్ లాలాచెరువు, బొమ్మూరు, మల్కిపురం, అమలాపురం వర్కుషాపులలో ఈనెల 29వ తేదీ వరకూ స్మార్ట్‌కేర్ క్లినిక్ శిబిరంలో ఆఫర్లు ఇస్తున్నట్టు ఆ సంస్థ హెడ్ ఆఫ్ ఆపరేషన్ జీఎం సునీల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఫ్రీ70 పాయింట్ చెకప్, మెకానికల్ పార్ట్‌లపై 10 శాతం, మెకానికల్ లేబర్‌పై 15 నుంచి 20 శాతం , వీల్ ఎలైన్మెంట్, బ్యాలెన్సింగ్‌పై 15 శాతం, ఇంటీరియల్, ఎక్స్‌పెరియల్ బ్యూటిఫికేషన్, డ్రైవాష్‌పై 20 శాతం స్పెషల్ డిస్కౌంట్ ఆఫర్లు ఉన్నాయన్నారు.రూ.వెయ్యి మంది లక్కీ కస్టమర్లకు రివార్డ్స్ బైషెల్ ఇండియా గిఫ్ట్‌ప్యాక్‌లు ఇస్తామన్నారు. ఇతర వివరాలకు సర్వీస్ మేనేజర్ 80966 66391, 80966 66085 ను సంప్రదించాలన్నారు.

గ్యాస్ సిలెండర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సిలెండర్లతో అధికారులు

కంబాలచెరువు: జాంపేటలోని సలాం రెస్టారెంట్‌లో అక్రమంగా వినియోగిస్తున్న ఐదు గృహావసరాల గ్యాస్ సిలెండర్లను మంగళవారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏ.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. తనిఖీల్లో ఐదు సిలెండర్లను గుర్తించారు. రెస్టారెంట్ యజమాని బిస్మిల్లా ఖాన్‌పై కేసు నమోదు చేశారు. కార్యాలయ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, వ్యవసాయాధికారి భార్గవ మహేష్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలతో సమానత్వం



జాన్‌వెస్లీని సత్కరిస్తున్న ఎర్నెస్ట్ మోజెస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వెంకటాపురంలోని సీయోను ప్రార్థనా మహిమ మందిరం – షారోను గృహం ప్రాంగణంలో జరుగుతున్న బైబిల్ మిషన్ రాకడ సభలు మంగళవారంతో ముగిశాయి. ఈ సభలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బి.జాన్‌వెస్లీ మాట్లాడుతూ క్రీస్తు బోధనల ద్వారా సమానత్వం లభిస్తుందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సిన్హా సీయోను క్రైస్తవ పాటల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సభలకు పి.ఎర్నెస్ట్ మోజెస్ అధ్యక్షత వహించగా, సంఘ వ్యవస్థాపకులు ఎలిజబెత్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసం



మాట్లాడుతున్న డాక్టర్ గూటం స్వామి

రాజమహేంద్రవరం రూరల్: పుస్తక పఠనంతో విజ్ఞానం వికసిస్తుందని జీపీఆర్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లెమొగ్గల సుబ్బయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆ పాఠశాలలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్బయ్య మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, పుస్తకానికి ఉండే విలువ ఎప్పటికీ తగ్గదన్నారు. తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ గూటం స్వామి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం విద్యార్థుల కర్తవ్యంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు సునీల్ కుమార్, పార్వతి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో పాఠశాల లైబ్రరీలోని పుస్తకాలు చదివించి, వాటిపై క్విజ్ పోటీ నిర్వహించారు.

ఆహ్లాదం.. విజ్ఞానం..

- కార్తిక మాసంలో అతిథ్యానికి చిరునామాగా ధవళేశ్వరం
- ఆకట్టుకుంటున్న కాటన్ మ్యూజియం, ఆనకట్ట
- ఆసక్తి చూపుతున్న సందర్శకులు

ధవళేశ్వరం: కార్తిక మాసంలో ఆతిథ్యానికి ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియం, దొరగారి బంగ్లా నెలవుగా మారాయి. కార్తిక మాసం పేరు వింటేనే ప్రతి ఒక్కరిలోనూ ఉత్సాహం ఉరకలేస్తుంది. స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు, సంఘీయులతో సరదాగా గడపవచ్చనే సంతోషం నెలకొంటుంది. తమకిష్టమైన ప్రదేశాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ఉంటారు. అలాంటి వారికి ఆహ్లాదంతో పాటు విజ్ఞానాన్ని పంచుతోంది ధవళేశ్వరం. గ్రామంలోని కాటన్ బ్యారేజీ, మ్యూజియం, దొరగారి బంగ్లాతో పాటు సమీపంలోని కడియం నర్సరీలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు.

విజ్ఞాన భాండాగారం

ఒక పక్క గోదావరి అందాలు, మరో పక్క విజ్ఞానాన్ని అందించే కాటన్ మ్యూజియం కార్తిక మాసంలో పర్యాటకులతో కిటకిటలాడుతుంటాయి. మ్యూజియంలో ఆనకట్ట నిర్మాణ విశేషాలు, గోదావరి నదీ ప్రవాహ స్వరూపాలను వివరిస్తూ నమూనాలను పొందుపరిచారు. దీంతో మ్యూజియం విజ్ఞానం, వినోదాల మేళవింపుగా విరాజిల్లుతోంది. 1984లో కాటన్ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఆనకట్ట నిర్మాణ సమయంలో వినియోగించిన యంత్రాలు, పనిముట్లను సందర్శనకు ఉంచారు. గోదావరి పుట్టుక నుంచి కడలిలో కలిసే వరకూ ప్రయాణ నమూనాలను ఏర్పాటు చేశారు. ఆనకట్ట నిర్మాణానికి ముందు ఈ ప్రాంతంలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరిస్తూ చిత్రాలను మ్యూజియం లోపల పొందుపరిచారు. ఈ ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన 1986 వరదల సమయంలో నెలకొన్న పరిస్థితుల ఫొటోలను కూడా ఉంచారు. కాటన్ జీవిత విశేషాలు కూడా మ్యూజియంలో చూడవచ్చు. మరో పక్కన విద్యార్థులు ఆడుకునేందుకు ఆట వస్తువులను సైతం అందుబాటులో ఉంచారు. కాటన్ బ్యారేజీ సందర్శన మనసుకు ఆహ్లాదాన్ని పంచుతుంది. అయితే కాటన్ బ్యారేజీ సందర్శించే పర్యాటకులు బ్యారేజీ దిగువన ఇసుక తిన్నెలలో స్నానాలు చేసేందుకు దిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. బ్యారేజీ దిగువ దొంగ ఊబులు ఉన్నందున పర్యాటకులు దిగువకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి.

దొరగారి బంగ్లా

ధవళేశ్వరంలోని దొరగారి బంగ్లాకు పర్యాటకులు పోటెత్తుతుంటారు. బంగ్లా ఆవరణలో దశాబ్దాల



ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియం

చరిత్ర కలిగిన ఊడల మర్రులు ఒక పక్క, పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే ఆట వస్తువులు మరోపక్క పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. విశాలమైన ప్రదేశం ఉండటంతో వేలమంది ప్రతి రోజూ కార్తిక వనసమారాధనకు ఇక్కడకు వస్తుంటారు.

ఆకట్టుకుంటున్న నర్సరీలు

పర్యాటకులకు కడియం ప్రాంత నర్సరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. జాతీయ రహదారి నుంచి ప్రారంభమై దాదాపు 8 కిలోమీటర్ల లోపలి వరకు కడియం మండలంలో వివిధ గ్రామాల్లో విస్తరించిన నర్సరీలు కనువిందు చేస్తాయి. ముఖ్యంగా కార్తిక మాసంలో వచ్చే సీజనల్స్ వివిధ రకాల ఆర్నమెంట్ మొక్కలతో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. ఇక్కడ రకరకాల మొక్కల మధ్య సెల్ఫీలు



ఆనకట్ట నిర్మాణ సమయంలో వినియోగించిన ఆవిరి యంత్రం

దిగేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపుతుంటారు.

ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన అకడమిక్ ఆడిట్

కంబాలచెరువు: రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిషనరేట్, మంగళగిరి ఆధ్వర్యంలో రెండు రోజులుగా ప్రభుత్వ అటానమస్ కళాశాలలో జరుగుతున్న అకడమిక్ ఆడిట్ ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మంగళవారం తెలిపారు. గత రెండు విద్యా సంవత్సరాలకు గాను నిర్వహించిన విద్యా కార్యక్రమాల మదింపునకు నలుగురు అధ్యాపకుల బృందం ప్రత్యేకంగా విచ్చేసిందన్నారు. ఎస్‌డీ మదీనా, ఎస్‌ఆర్‌బీ చక్రవర్తి, కె.భద్రాచలం, కె.ఆనందరావుతో కూడిన ఈ బృందం రెండుగా విడిపోయి కళాశాలలోని వివిధ విభాగాలు, విద్యార్థి సహాయక విభాగాలు, పరిశోధన, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, వివిధ క్లబ్‌లు, జేకేసీ, పరీక్షల విభాగం, క్రీడల విభాగం పనితీరు, వివిధ ఫైళ్లపై క్షుణ్ణంగా సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. మంగళవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో కొన్ని విలువైన సూచనలు చేశారన్నారు. కొన్ని ఇతర ఏజెన్సీలతో అవగాహన ఒప్పందాలను చేసుకోవాలని, మరిన్ని అంకుర ప్రాజెక్టులను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కచ్చితంగా నాక్‌లో ఏ ప్లస్ సాధించే సత్తా కళాశాలకు ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైల శాస్త్రి, ఐక్యు ఏసీ సమన్వయ కర్త డాక్టర్ అన్నపూర్ణ, అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మధురపూడికి చెందిన దోసపాటి నాగసత్య కుమారిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఆమె నుంచి 180 ఎంఎల్ తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ మత్స్య దినోత్సవం

సీటీఆర్ఐ: ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకార సంఘం కన్వీనర్ వెలమ లక్ష్మణరావు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గోదావరి గట్టు పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న పద్మావతి ఘాట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. షర్మిలారెడ్డి మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా ఉంటామని, వారికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సాయం చేస్తామని చెప్పారు. జగనన్న ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశంలో 40 కోట్ల మంది మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులకు మత్స్యశాఖ విశిష్టతను, ఆర్థిక, పోషక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ ప్రియాంక, అధ్యాపకులు జి.దివ్యశ్రీ, డాక్టర్ దీపికా రాణి పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి బాలుడి మృతి



ఆకెళ్ల మణికంఠ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: అదృశ్యమైన బాలుడి ఘటన విషాదాంతమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లి గ్రామానికి చెందిన ఆకెళ్ల జగదీశ్వరి ప్రస్తుతం ఏలూరు పాత బస్టాండ్ ప్రాంతంలో ఉంటోంది. ఈనెల 18వ తేదీ ఆమె తన ఐదేళ్ల కుమారుడు మణికంఠ (మణిబాబు)ను తీసుకుని రాజమహేంద్రవరం ఆవ వాంబేకాలనీలో మేనత్త కుమార్తె పుట్టినరోజు వేడుకలకు వచ్చింది. అనంతరం మణికంఠను అక్కడే వదిలి అదే ప్రాంతంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లింది. అయితే తల్లి కోసం వెతుక్కుంటూ మణికంఠ బయటకు వచ్చి అదృశ్యమయ్యాడు. ఈ నేపథ్యంలో 19న జగదీశ్వరి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మణికంఠ ఆచూకీ కోసం తల్లి, బంధువులతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అయితే మంగళవారం ఉదయం సమయంలో వాంబేకాలనీలోని ఆరడుగులు లోతు కలిగిన డ్రైనేజీలో మణిబాబు శవమై తేలింది. తల్లి కోసం బయటకు వచ్చిన మణిబాబు డ్రైనేజీలో ప్రమాదవశాత్తూ పడిపోయి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయ కుమార్, ఎస్సై మహమ్మద్ జుబేర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగదీశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా ఎస్సై జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఆవ వాంబేకాలనీలో డ్రైనేజీలపై మూతలు లేకపోవడం వలనే మణిబాబు మృతి చెందాడంటూ సుమారు గంటపాటు వాంబే కాలనీ వాసులు నిరసన తెలిపారు.

పథకాలను రైతులు వినియోగించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం అందిస్తున్న శాశ్వత భూమి హక్కు–భూరక్షణ, సున్నావడ్డీ, వ్యవసాయ విద్యుత్ నగదు బదిలీ, రైతు భరోసా, రైతు రక్ష తదితర పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని బుచ్చియ్య నగర్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం గ్రామీణ కార్మికులకు, రైతులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రత్యూషకుమారి మాట్లాడుతూ రెండున్నర ఎకరాల భూమిగల రైతులకు బోరుబావి లేని పక్షంలో జలకళ పథకం ద్వారా ప్రభుత్వం బోరుబావులను తవ్విస్తోందన్నారు. రెండున్నర ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న రైతులు ఒక సమూహంగా ఏర్పడి లబ్ధిదారులు అవ్వాలన్నారు. ఉచిత పంటల బీమా పథకంలో కేవలం ఒక్క రూపాయితో తమను తాము నమోదు చేసుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, అనివార్య సంఘట



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

నల వల్ల నష్టపోయిన పంటకు పరిహారం లభిస్తుందన్నారు. అందరూ పిల్లలను కచ్చితంగా చదివించాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను చదువుకు దూరం చేయకూడదని, విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదన్నారు. ఎలాంటి సందేహాలు, సమస్యలున్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. సదస్సులో వ్యవసాయశాఖ ఏడీ డి.శ్రీనివాసరెడ్డి, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, పారాలీగల్ వలంటీర్ జి.పాండవులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో బంగారు పతకం

ప్రకాశం నగర్: సత్యసాయిబాబా 98వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నగరానికి చెందిన కె.ప్రవీణ్ కుమార్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ సభా మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్‌జే రత్నాకర్, ప్రపంచ వ్యాప్త సంస్థల చైర్మన్ చక్రవర్తి, అఖిల భారత సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమేష్ పాండ్యా, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు సమక్షంలో బంగారు పతకం, సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ విషయాన్ని సత్యసాయి ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కాగా.. ప్రవీణ్ కుమార్‌ను ఆదిత్య కళాశాల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్ అభినందించారు.

పాత పెన్షన్ విధానం కోసం సమ్మె బ్యాలెట్

రాజమహేంద్రవరం సిటీ: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ దేశవ్యాప్తంగా రెండు రోజుల పాటు సమ్మె బ్యాలెట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నగర శాఖ మెకానికల్, ఇంజినీరింగ్ బ్రాంచ్ సెక్రటరీ కె.విజయకుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రైల్వే సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట సమ్మె బ్యాలెట్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే ఏకైక అజెండాతో కేంద్ర ప్రభుత్వ కార్మిక సంఘాల నాయకత్వంలో సమ్మె బ్యాలెట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే కార్మికులు 60 శాతం నిరవధిక సమ్మెకు అనుకూలంగా ఓటు వేస్తే, కేంద్ర ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇచ్చి, పాత పెన్షన్ విధానం సాధన కోసం నిరవధిక సమ్మె వెళ్లాలనే



సమ్మె బ్యాలెట్ నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగులు

నిర్ణయం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె బ్యాలెట్‌లో వచ్చిన అనుకూల శాతానికి ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టకపోతే ఏపీఎస్ సాధనకు నిరవధిక సమ్మెకు వెనుకాడేది లేదని సెక్రటరీలు విజయ కుమార్ ధర్మాల శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో వసంతరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగనన్నను దీవించండి

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- 37వ డివిజన్‌లో గడప గడపకూ..

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ పథకాల ప్రదాత జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా దీవించాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలో 37వ డివిజన్‌లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలు ఏమైనా తెలియజేస్తే తక్షణమే పరిష్కరించే చర్యలు చేపడతామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే జగనన్న సంకల్పమన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న జగనన్నకు మరోసారి పట్టం కట్టాలన్నారు. స్థానికులు తెలిసిన సమస్యలపై అంచనాలు రూపొందించి ఆయా పనులు



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా సచివాలయాల పరిధిలో చేపట్టిన పనులు ఎటువంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు సబ్బారపు సూరిబాబు, బాలాజీ రెడ్డి, ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం, మజ్జి అప్పారావు, నామన వాసు, దూడల త్రినాథ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం చేసేవరకూ పోరాటం

కంబాలచెరువు: న్యాయవాదుల రక్షణ చట్టం చేసేవరకు తమ పోరాటం ఆగదని, కేంద్రప్రభుత్వం తక్షణం స్పందించి ఆ చట్టాన్ని చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గోకవరం బస్టాండ్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి, వినతిపత్రం సమర్పించారు. చేపట్టారు. నంద్యాలకు చెందిన న్యాయవాది మంద విజయ్ కుమార్‌పై జరిగిన దాడికి నిరసనగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు బీర అరుణ్ కుమార్, ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం వెంటనే అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలన్నారు. విజయ్ కుమార్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటీవల దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు హెచ్చుమీరాయని, ఇది ఇలాగే కొనసాగితే న్యాయవాదులు స్వేచ్ఛగా విధులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విజయ్ కుమా



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ర్‌పై దాడి ఘటనను నిరసిస్తూ మంగళవారం రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులందరూ విధులను బహిష్కరించారన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు సోమిన రామకృష్ణ, ప్రసన్న కుమార్, న్యాయవాదులు పీఎల్.నాగేశ్వరరావు, బత్తుల రాజు, దీపాటి శ్యాంబాబు, అల్లంకి నితీష్, చింతపల్లి త్రిమూర్తులు, వినుకొండ లక్ష్మీనారాయణ, ఎంఎస్ఎస్ కిశోర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: లాలాచెరువు వద్ద జాతీయ రహదారిని దాటుతున్న వృద్ధుడిని కారు ఢీకొంది. తీవ్రగాయాలపాలైన అతడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. దేవీపట్నం మండలం ఇందుకూరుకు చెందిన గొట్టా అప్పారావు (70) లాలాచెరువులోని వరికోతల మిషన్ల డీలర్ వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో కూర కోసం లాలాచెరువు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా ఓ కారు ఢీకొంది. అతడిని వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ఘటనపై బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



బొమ్మూరు సచివాలయం-4లో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న తాడి కృష్ణ, తాటికొండ విష్ణుమూర్తి



కడియంలో బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, చిత్రంలో మండల అధ్యక్షుడు స్టాలిన్

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగనన్న రాష్ట్రంలో సంక్షేమ పథకాల విప్లవాన్ని సృష్టించారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని నాలుగు సచివాలయాల్లో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల యూనిట్‌గా అభివృద్ధి పనులు నిర్వహిస్తూ, నిర్మాణాత్మక అభివృద్ధిని చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారుల వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ, ప్రజలకు పారదర్శకంగా పాలన అందిస్తోందన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత జగనన్న ప్రభుత్వానికి తేడా గమనించి జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో పోలు విజయలక్ష్మి, కొత్త విజయరాజ్యలక్ష్మి, పెంకే సురేష్, మజ్జి అప్పారావు, బర్రే కొండబాబు, అజ్జరపు వాసు, మానే దొరబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రాజమహేంద్రవరం రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. బొమ్మూరు సచివాలయం–4 పరిధిలోని టీచర్స్ కాలనీలో మంగళవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్, ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ తాడికృష్ణ, తాటికొండ విష్ణులు సచివాలయ కన్వీనర్లు కేవీ సుబ్బారెడ్డి, టీవీ రమణ, ఏ.రాణితో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అలాగే నేతాజీ నగర్‌లో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ గ్రామ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు, ఇతర సచివాలయ కన్వీనర్లు ఎలుగొండ లక్ష్మి, సద్గుణ రామారెడ్డి, తోడేటి రాజా, కుడిపూడి వీరంశెట్టి, వల్లి శ్రీను, కాకులపాటి కుమార్, బంకా వెంకటరెడ్డి, ఎస్‌కే సమీరా పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర అన్నారు. స్థానిక 18వ డివిజన్ కొండావారివీధి వార్డు సచివాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన, డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పినీడి ప్రసాద్‌బాబు (రాజమౌళి), సచివాలయం కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. నాగేంద్ర మాట్లాడుతూ కొండావారివీధి వార్డు సచివాలయం పరిధిలో రూ.20.68 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారన్నారు. అనంతరం డిజిటల్ బోర్డును మింది నాగేంద్ర, నోడల్ ఆఫీసర్ రాజకుమారి ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేసి, డివిజన్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు అంగాడ సత్యప్రియ, దమ్ము ప్రసాద్, షేక్ ఇమామ్ (బాబ్జీ), పడమటి కామరాజు, కన్నమాంబ గుడి చైర్మన్ దుంపా చంద్రారెడ్డి, డైరెక్టర్లు పడమటి నాగమణి, కొల్లేటి వరలక్ష్మి, బాబ్జి రెడ్డి, విశ్వేశ్వరాలయం డైరెక్టర్ కాపుభాను, నగర యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ, జువ్వల నాగిరెడ్డి, దోనెపాటి రాజేష్ పాల్గొన్నారు.

నూతన సంస్కరణలు

కడియం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నూతన సంస్కరణలు తెచ్చారని, తద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు నేరుగా చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని కడియం సచివాలయం 4 పరిధిలోని భాస్కర్‌రామ్ నగర్‌లో మంగళవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గిరజాల బాబు మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు.



కొండావారివీధిలో జెండా ఎగుర వేస్తున్న మింది నాగేంద్ర తదితరులు

సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల సహకారంతో ప్రజలకు నేరుగా పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడియం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, నర్సరీ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు కొత్తపల్లి శివాజీ, స్థానిక నాయకులు పసల నాయుడు, మహిచర్ల శ్రీనివాస్, శాకా పట్టాభి, దేవాలయ చైర్మన్లు ఆర్ఎస్ఎన్ మూర్తి, బందారు వరలక్ష్మి శ్రీనివాస్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్డా బుజ్జి, కుసునూరి బాబులు, కొత్తూరి బాల నాగేశ్వరరావు, అడపా సుబ్రహ్మణ్యం, కందా రాజు, పిండి నాగరాజు, సర్కార్ బాషా, పూడి వీరబ్రహ్మం, మంగు వర ప్రసాద్, గోవిందు, కడియం గంగారావు పాల్గొన్నారు.